క్లుప్తంగా

చెన్న మల్లికార్జునుడికి లక్షబిల్వార్చన



తోట్లవల్లూరు: స్థానిక శ్రీభ్రమరాంబ చెన్నమల్లి కార్జునస్వామి ఆలయంలో లక్షబిల్వార్చన ఆదివారం ఘనంగా జరిగింది. ఆలయ అర్చకుల వేదమంత్రోచ్చరణల నడుమ చెన్నమల్లికార్జున స్వామికి మారేడు దళాలతో లక్షబిల్వార్చన, భ్రమరాంబ అమ్మవారికి కుంకుమ పూజలను భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో రాత్రికి భక్తులు శివలింగాకారంలో దీపాలను వెలిగించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారిని దర్శించుకుని పూజలు జరిపారు. ఆయా కార్యక్రమాలను ఆలయ సిబ్బంది పర్యవేక్షించారు.

రామలింగేశ్వరునికి ప్రత్యేక పూజలు



కూచిపూడి(మొవ్వ): ప్రముఖ సినీ రచయిత జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు ఆదివారం సాయంత్రం నాట్యక్షేత్రం కూచిపూడిలోని నాట్యాచార్యుల ఇలవేలుపైన శ్రీ బాలా త్రిపుర సుందరీ సమేత శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయాన్ని కుటుంబ సభ్యులతో దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ వివరాలను, ప్రాశస్త్యాన్ని వేద పండితుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. దేవాలయాల ప్రాశస్త్యాన్ని సమాజానికి తలియజేసేందుకు ఓ గ్రంథాన్ని రూపొందిస్తున్నానని.. దీనిలో భాగంగానే ప్రాచుర్యం గల దేవాలయాలను సందర్శించి వివరాలు సేకరిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు, కమిటీ సభ్యులు జొన్నవిత్తుల దంపతులను శేష వస్త్రాలతో సత్కరించారు.

సామాజిక తనిఖీ గ్రామ సభ



మొవ్వ: మండలంలో 2021–22 ఆర్థిక సంవత్సరంలో ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ ద్వారా నిర్వహించిన వివిధ పనులపై సామాజిక తనిఖీలు నిర్వహించారు. బృందాలు నివేదికలను రూపొందిస్తున్నారు. దీనిలో భాగంగా ఆదివారం అవురుపూడి గ్రామంలో డీఆర్‌పీ జి.పూర్ణబాబు గ్రామంలో నిర్వహించిన 60 పనులను పరిశీలించి జియోటాగింగ్ నమోదు చేశారు. నిడుమోలు గ్రామంలో నిర్వహించిన 95 పనులను, గ్రామంలో వైఎస్సార్ పెన్షన్‌కానుక లబ్ధిదారుల వివరాలను డీఆర్‌పీ కే సాంబశివరావు పరిశీలించారు. అనంతరం డీఆర్‌పీ పర్యవేక్షణలో పంచాయతీ కార్యాలయం వద్ద గ్రామ సభను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ ఎంపీపీ డొక్కు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

భగవద్గీత శ్లోక కంఠస్థ పోటీలకు స్పందన



మచిలీపట్నంటౌన్: వీహెచ్‌పీ కృష్ణా జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక బైపాస్‌రోడ్డులోని కృష్ణవేణి ఐటీఐ కళాశాల ప్రాంగణంలో భగవద్గీత శ్లోక కంఠస్థ పోటీలు నిర్వహించారు. ఎల్‌కేజీ నుంచి పీజీ విద్యార్థులు 47 మంది పాల్గొని శ్లోకాలను పఠించారు. 18 మంది మహిళలు, 11 మంది పురుషులు భగవద్గీత 10వ అధ్యాయం విభూతి యోగం 42వ శ్లోకాలు పఠించారు. విజేతలకు కళాశాల కరస్పాండెంట్ కొత్తగుండు రమేష్, విశ్వ హిందూ పరిషత్ జిల్లా కార్యదర్శి అల్లూరి లక్ష్మీకాంతారావు, జిల్లా కోశాధికారి కోట శ్రీకాంత్ బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. పోటీలకు హాజరైన విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు భోజన వసతి ఏర్పాటు చేశారు.

పవర్ లిఫ్టర్ షబీనాకు సన్మానం

చల్లపల్లి: ముస్లిం యువతి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో అంతర్జాతీయ స్థాయిలో రాణించడం గర్వకారణమని నియోజకవర్గ ప్రభుత్వ ఖాజీ మహమ్మద్ మెహబూబ్ పాషా అన్నారు. ఆదివారం స్థానిక అరబ్బీ మదరసా వద్ద ముస్లిం చైతన్య వేదిక నియోజకవర్గ సమావేశం జరిగింది. తెనాలికి చెందిన పవర్ లిఫ్టర్ షబీనాను అవనిగడ్డ శ్రీరామా వెల్ఫేర్ సొసైటీ కన్వీనర్ తోట శ్యాం కిషోర్ నాయుడు ఆధ్వర్యంలో సన్మానించారు. చైతన్య వేదిక నియోజకవర్గ నూతన కార్యవర్గాన్ని సత్కరించారు. రాష్ట్ర అధ్యక్షులు షేక్ మౌలాలీ, అధికార ప్రతినిధి పఠాన్ కరిముల్లా ఖాన్, జిల్లా అధ్యక్షులు అమీరా, నియోజకవర్గ అధ్యక్షులు షేక్ నబీఘోరీ పాల్గొన్నారు.

తీరిన తాగునీటి సమస్య

- పట్టణ ప్రజలకు పుష్కలంగా తాగునీటి సరఫరా
- రూ.5.58 కోట్లతో మూడు వాటర్‌ట్యాంక్‌ల నిర్మాణం
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు



వాటర్‌ట్యాంక్‌ను ప్రారంభిస్తున్న ఎంపీ బాలశౌరి, ఎమ్మెల్యే కొడాలి నాని (ఫైల్)

గుడివాడ టౌన్: పట్టణ ప్రజల దాహార్తిని తీర్చేందుకు ప్రజాప్రతినిధుల కృషికి ప్రభుత్వ సహకారం ఫలించింది. పట్టణంలోని శివారు ప్రాంతాలకు కూడా తాగునీరు అందే పరిస్థితి వచ్చింది. రూ.5.58 కోట్లతో మూడు వాటర్‌ట్యాంక్‌ల నిర్మాణం విజయవంతంగా పూర్తిచేసి ప్రారంభించడంతో ప్రజలకు తాగునీరు పుష్కలంగా అందుతోంది.

సమస్య ఇదీ..

పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు గత ప్రభుత్వం సహకరించలేదు. దీంతో పట్టన ప్రజలను తాగునీటి సమస్య వెంటాడింది. పట్టణంలోని గుడ్మెన్ పేట వద్ద గల రిజర్వాయర్‌కు గతంలో లీకులు ఏర్పడిన కారణంగా తక్కువ స్థాయిలో నీటిని ఎక్కించేవారు. దీంతో 11 నుంచి 19 వార్డుల ప్రజలకు నీరు పూర్తి స్థాయిలో అందేది కాదు. స్థానిక ఎమ్మెల్యే కొడాలి నాని పంపిన నీటి ట్యాంకులు కొంత ఆదుకున్నాయి.

ప్రజాప్రతినిధుల కృషితో రూ.3.28 కోట్లు..

ప్రజలు తరుచూ ఈ విషయాన్ని స్థానిక ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు (నాని) దృష్టికి తేగా దీన్ని పూర్తి స్థాయిలో ప్రక్షాళన చేయాలని నిర్ణయించుకున్నారు. దీంతో బందరు పార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాలశౌరి, సీఎం జగన్ సహకారంతో అమృత్ పథకం–2 నిధులు రూ.3.28 కోట్లు కేటాయించి పాత ట్యాంక్ పూర్తిగా తొలగించి కొత్త ట్యాంక్ నిర్మాణం చేపట్టి ప్రారంభించారు.

మరో రెండు ట్యాంకుల నిర్మాణం..

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహనరెడ్డి సహకారంతో స్థానిక నాగవరప్పాడులో రూ.కోటితో, నక్కల కాలువ వద్ద రూ.1.3 కోట్లతో రెండు ట్యాంకులు నిర్మించారు. వీటిద్వారా ప్రజలకు తాగునీరు అందుతున్నాయి. దీంతో పట్టణంలోని



గుడ్‌మెన్‌పేట వాటర్ ట్యాంక్

శివారు ప్రాంతాల్లో మూడు ట్యాంక్‌లు ఏర్పాటు చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన రెడ్డి ప్రభుత్వానికే దక్కింది. శివారు ప్రాంతాల ప్రజలకు తాగునీటి సమస్య తీరింది. గుడ్‌మెన్ పేటలో నిర్మించిన ట్యాంక్ నిర్ణీత సమయానికి ముందుగానే ట్యాంక్ నిర్మాణం పూర్తయి ప్రారంభం కావడంతో ఇక నీటి ఇబ్బందులు తొలగాయి. 18 లక్షలు నీటి సామర్థ్యం గల ఈ ట్యాంక్‌ను పూర్తిగా నీటితో నింపితే పట్టణంలోని 11 నుంచి 19 వార్డుల ప్రజలకు పుష్కలంగా నీరు అందుతోంది.

143 ఎకరాల్లో నీటి నిల్వలు..

ఇప్పటికే పట్టణ ప్రజల నీటి అవసరాలు తీర్చేందుకు బ్రిటిష్ కాలంలో ఏర్పాటు చేసిన 43 ఎకరాల పంపుల చెరువుతో పాటు డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో నిర్మించిన 100 ఎకరాల చెరువు సైతం పూర్తిగా నీటితో నింపుతున్నారు. దీంతో తాగునీటి సమస్యకు చెక్‌పడింది.

పట్టణంలో మొత్తం 11 ట్యాంకులు..

పట్టణంలో ప్రజల తాగునీటి అవసరాలు తీర్చేందుకు ట్యాంకుల సంఖ్య 11కు చేరింది. పూర్వం నిర్మించినవి 7 ట్యాంకులు కాగా ప్రస్తుత ప్రభుత్వంలో ప్రజాప్రతినిధుల కృషితో 3 ట్యాంకులు నర్మించి ప్రారంభించారు. టిడ్కో గృహాల సముదాయంలో మరో అతిపెద్ద ట్యాంకు నిర్మాణ దశలో ఉంది.

ట్యాంకుల నీటి సామర్థ్యం..

పట్టణంలోని గుడ్‌మెన్‌పేట ట్యాంక్ 18 లక్షల లీటర్లు, తహసీల్దార్ కార్యాలయం వద్ద గల రెండు ట్యాంక్‌లు ఒక్కొక్కటి 7.5 లక్షల లీటర్లు, నాగవరప్పాడులో నూతనంగా నిర్మించిన ట్యాంక్ ద్వారా 5 లక్షల లీటర్లు, నక్కల కాల్వవద్ద గల ట్యాంక్ ద్వారా 9 లక్షల లీటర్లు, బేతవోలు, ఎరికపాడు, టీచర్స్ కాలనీలలోని ఒక్కొక్క ట్యాంక్ ద్వారా 15.5 లక్షల లీటర్లు, ఆర్టీసీ కాలనీలో ట్యాంక్ ద్వారా 1.50 లక్షల లీటర్లు, శాంతి నగర్ ట్యాంక్ ద్వారా 12 లక్షల లీటర్లు, మొత్తం 1 కోటి 7 లక్షల లీటర్ల నీటిని ప్రతిరోజూ ప్రజలకు అందించగలుగుతామని అధికారులు చెపుతున్నారు.

చాలా ఇబ్బందులు పడేవాళ్లం..



గతంలో వార్డులోని శివారు ప్రాంతాలకు మంచినీరు వచ్చేది కాదు. ఒకరోజు వస్తే లీకులంటూ రెండు రోజులు ఆపేసేవారు. అప్పట్లో ట్రాక్టర్ ట్యాంకుల ద్వారా స్థానిక ఎమ్మెల్యే కొడాలి నాని పంపిన నీటిని వినియోగించుకునే వాళ్లం. బోర్లు లేని ఇళ్లలో నీటి కష్టాలు అనేకం అనుభవించాం. ట్యాంకు పూర్తయింది. ఇక మా కష్టాలు తొలగిపోయాయి.

–షేక్‌బాబా, స్థానికుడు

నీటి కష్టాలు తీరాయి..



ఎమ్మెల్యే కొడాలి నాని ట్రాక్టర్ ట్యాంకుల ద్వారా నీళ్లు పంపినా అవి వచ్చే సమయానికి ఇళ్లలో లేకపోతే నీళ్లు అందేవి కాదు. మా ప్రాంతంలో అధికశాతం చిన్న చిన్న పనులకు బయటకు వెళ్లేవారమే. దీంతో సకాలంలో మంచినీరు అందక ఇబ్బందులు పడేవాళ్లం. నీళ్లు కొనుక్కునేవాళ్లం. కొడాలి నాని సహకారంతో ట్యాంక్ పూర్తిచేయడం సంతోషం.

–మోతీహాబేగం, స్థానికురాలు

సేవాగుణంతో ముందుకు సాగాలి

- ఎమ్మెల్యే డీఎన్నార్
- సందడిగా వన సమారాధనలు

కైకలూరు: సమాజంలో సేవాగుణంతో ముందుకు సాగాలని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) అన్నారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో 15వ వార్షిక కైకలూరు నియోజకవర్గ స్థాయి కాపు కార్తిక వనసమారాధన ఆదివారం ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే డీఎన్నార్ మాట్లాడారు. ఎమ్మెల్యే డీఎన్నార్, కుమారులు వినయ్, శ్యామ్ దంపతులను కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. పాట కచేరి, భరతనాట్యం, వివిధ హీరోల డూప్‌లతో ప్రదర్శన ఆకట్టుకున్నాయి. వివిధ ఆటల పోటీలు నిర్వహించి బహుమతులనుఅందించారు.నియోజకవర్గం నుంచి వేలాది కాపు కుటుంబాలు హాజరయ్యాయి. ప్రముఖులను కమిటీ సభ్యులుసత్కరించారు. ఎంపీపీలు పెద్దిరెడ్డి శ్రీరామదుర్గాప్రసాద్,చందన ఉమామహేశ్వరరావు, రామిశెట్టి సత్యనారాయణ, తెలగంశెట్టి శ్రీనివాసరావు, మంగినేని రామకృష్ణ, అద్దంకి శ్రీనివాసరావు, ప్రొఫెసర్ విజయ్‌కుమార్, పేటేటి భాస్కరావు, నిమ్మల సాయి, తులసి పూర్ణ, పంజా నాగు, సమయం రామాంజనేయులు, కాళ్ళపాలెం బుజ్జి, పంజా రామారావు, చిట్టూరి రామ్మోహనావు, కురేళ్ళ మురళీకృష్ణ, చెన్నంశెట్టి కోదండరామయ్య పాల్గొన్నారు.

వృద్ధులకు వస్త్రదానం

కైకలూరు: కాపు కార్తిక వనసమారాధనను పురస్కరించుకుని విజ్ఞాన్ కాలేజీ వద్ద నియోజకవర్గంలో 2 వేల మంది వృద్ధులకు అమ్మా–నాన్న సహాయక సేవా సంస్థ ద్వారా ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) పంచెలు, చీరలను ఆదివారం పంపిణీచేశారు.ముఖ్యఅతిథిగారాజ్యసభ సభ్యుడు బీదా మస్తాన్‌రావు హాజరయ్యారు. మస్తాన్‌రావు మాట్లాడుతూ ఎమ్మెల్యే డీఎన్నార్ 15 ఏళ్లుగా పేదలకువస్త్రదానంచేయడం అభినందనీయమన్నారు. అతిథులను ఎమ్మెల్యే డీఎన్నార్ సన్మానించారు.



ఎమ్మెల్యే డీఎన్నార్ దంపతులను సన్మానిస్తున్న వనసమారాధన కమిటీ సభ్యులు



పేదలకు దుస్తులు పంపిణీ చేస్తున్న రాజ్యసభ సభ్యుడు మస్తాన్‌రావు, ఎమ్మెల్యే డీఎన్నార్



బొడ్డపాడులో అనంత భట్టర్ దంపతులను సన్మానిస్తున్న వైఖానస సేవా సంఘ సభ్యులు

అన్ని రంగాల్లో ఐక్యంగా ముందుండాలి

కైకలూరు: రెడ్డి సామాజికవర్గం ఐక్యతతో పనిచేసి అన్ని రంగాల్లో ముందుండాలని రెడ్డి సంక్షేమ సంఘం ఉమ్మడి పశ్చిమగోదావరి ప్రధాన కార్యదర్శి కోనాల బలరామ రత్నారెడ్డి చెప్పారు. గోనెపాడు గ్రామంలో రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో 6వ కార్తిక వనసమారాధన జరిగింది. కైకలూరు నియోజకవర్గ రెడ్డి సంఘ కన్వీనరుగా సత్తి సుబ్బిరెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రెడ్డి సంక్షేమ సంఘ క్యాలెండర్‌ను అవిష్కరించారు. ముఖ్య అతిథులు ఆంధ్ర హాస్పిటల్ హార్ట్ స్పెషలిస్ట్ డాక్టర్ కోనాల శ్రీనివాసరెడ్డి, గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ (సర్జికల్) డాక్టర్ వెలగల జయపాలరెడ్డిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమానికి ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా రెడ్డి సంక్షేమ సేవా సంఘం అధ్యక్షుడు ద్వారంపూడి వేణుగోపాలకృష్ణారెడ్డి, నాయకులు తాడి భీమారెడ్డి, నియోజకవర్గంలో రెడ్డి సామాజికవర్గ కుటుంబ సభ్యులు హాజరయ్యారు.

వేణుగోపాలస్వామి ఆలయంలో..



గోనెపాడు గ్రామంలో పూజలు చేస్తున్న రెడ్డి సామాజికవర్గ ప్రముఖులు

పామర్రు: వైఖానస సేవా సంఘం ఉయ్యూరు శాఖ ఆధ్వర్యంలో కార్తిక వన సమారాధన కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. తోట్లవల్లూరు మండలం బొడ్డపాడు గ్రామంలోని వేణుగోపాల స్వామి ఆలయంలో కార్తిక వన సమారాధన కార్యక్రమం జరిగింది. ఆలయంలో స్వామికి అభిషేకాలు, అనంతరం విశేష పూజలు చేశారు. ఉసిరిచెట్టు వద్ద ధాత్రీ పూజ, లక్ష్మీనారాయణ పూజ, సత్యనారాయణ స్వామి వ్రతాలను ఏఆర్ యూ భాస్కరాచార్యులు దంపతులు నిర్వహించారు. నారాయణం అనంత భట్టర్ దంపతులను సత్కరించారు. చిన్నారులకు కృష్ణాష్టకమంపై పోటీలను



ఉసిరిచెట్టుకు పూజలు చేస్తున్న కళాకారులు

నిర్వహించారు. మహిళలకు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. సహపంక్తి భోజనాలను చేశారు. సంఘ అధ్యక్షుడు దీవి లక్ష్మీనారాయణాచార్యులు, ప్రధాన కార్యదర్శి ముత్తేవి యోగ లక్ష్మీ శ్రీనివాస్, కోశాధికారి పరాశరం యోగానంద సత్యమూర్తి, గౌరవ అధ్యక్షుడు వేదాన్తమ్ సేతు మధవాచార్యులు, నారాయణం శ్రీనివాసమూర్తి, గౌరవ సలహాదారులు పరాశరం రామకృష్ణ మాచార్యులు సంయుక్త కార్యదర్శులు రొంపిచర్ల రంగ ప్రసాద్, వేదాంతం వాణి, ఏ.రాజగోపాలాచార్యులు, సహాయ కారదర్శులు పరాశరం రంగవల్లి, తమిరిశ వేద ప్రకాష్, సభ్యులు ముత్తేవి మాధవ గౌతమ్, తిమిరశ వేణుగోపాల్, పరాశరం నాగ వెంకట కార్తీక్, ఆర్.ప్రణవ, భార్గవ కృష్ణ పాల్గొన్నారు.

పట్టణ కళాకారుల సమాఖ్య ఆధ్వర్యంలో..

గుడివాడ టౌన్: స్థానిక కన్యకా పరమేశ్వరి దేవస్థానం ప్రాంగణంలో ఆదివారం కార్తిక వన సమారాధన కార్యక్రమం జరిగింది. పట్టణ కళాకారుల సమాఖ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో తొలుత ఉసిరిచెట్టు వద్ద పూజలు నిర్వహించారు. పేద కళాకారులకు వితరణ అందజేశారు. అనంతరం కళాకారుల ప్రదర్శనలతో వనసమారాధనలు ముగిశాయి. ఈ కార్యక్రమంలో సమాఖ్య గౌరవాధ్యక్షుడు బి.రామ్మోహనరెడ్డి, అధ్యక్షుడు విన్నకోట సత్యన్నారాయణ (బుజ్జి), ఉపాధ్యక్షులు లోయ రాధాకృష్ణ, లంకపల్లి ప్రకాష్, కార్యదర్శి టీఎస్ బాబు, కోశాధికారి ఆత్మకూరి సాంబశివరావు, ఎస్. మల్లి, బండారు రాధాకృష్ణ, మట్టా రాజా, భానుప్రసాద్, పి. సత్యన్నారాయణ, సభ్యులు అమల పార్వతి, అమ్ముల సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

కలసికట్టుగా ఉండాలి

రాష్ట్ర సూర్యబలిజ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ శెట్టి అనంతలక్ష్మి

గుడివాడరూరల్: సూర్యబలిజ సంఘీయులు అందరూ కలసికట్టుగా ఉండాలని రాష్ట్ర సూర్యబలిజ సంఘం కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ శెట్టి అనంతలక్ష్మి పేర్కొన్నారు. మండలంలోని బిళ్లపాడు రైల్వేగేటు సమీపంలో ఉన్న సూర్యబలిజ కళ్యాణ మండపంలో ఆదివారం నిర్వహించిన 11వ కార్తిక వనసమారాధన కార్యక్రమంలో గుడివాడ అధ్యక్షుడు ఎంఆర్ మోహనరావు సభకు అధ్యక్షత వహించగా ఆమె ముఖ్య అతిథిగా జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. రాష్ట్ర సూర్యబలిజ ప్రముఖులు, వివిధ జిల్లాల సూర్యబలిజ నేతలు, సంఘీయులు కుటుంబ



బిళ్లపాడులో వనసమారాధనలో అనంతలక్ష్మి, సూర్యబలిజ సంఘీయులు

సభ్యులతో సహా పాల్గొని ఆట, పాటలతో ఆహ్లాదంగా గడిపి వన భోజనాలు చేశారు. కార్యక్రమంలో జిల్లా అదనపు మాజీ జడ్జి కంచుమర్తి రాంబాబు, హైకోర్టు న్యాయవాది జి.హరగోపాల్, న్యాయవాది పి.పద్మలత, రాష్ట్ర అధ్యక్షుడు మద్దెల కై లాష్‌నాథ్, సంఘ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు దాసరి కేశవులు, పలువురు సంఘీయులు పాల్గొన్నారు.

మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదం

రాష్ట్రస్థాయి చెడుగుడు పోటీలు ప్రారంభం

కలిదిండి: శారీరక, మానసిక ఉల్లాసానికి క్రీడలు ఎంతగానో దోహదం చేస్తాయని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) అన్నారు. కోరుకొల్లు గ్రామంలో అంబేడ్కర్ యూత్ ఆధ్వర్యంలో జరుగుతున్న రాష్ట స్థాయి చెడుగుడు పోటీలకు ఆదివారం ఎమ్మెల్యే డీఎన్నార్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి యువత వీడియో గేమ్స్‌కు, ఫోన్లకు అలవాటు పడి క్రీడలు ఆడేవారు తగ్గుముఖం పడుతున్నారన్నారు. ఈ తరుణంలో క్రీడలను ప్రోత్సహిస్తూ చెడుగు పోటీలు నిర్వహిస్తున్న నిర్వాహకులను అభినందిస్తున్నారు. క్రీడాకారులందరికి అల్ ది బెస్ట్ చెబుతూ కరచాలనం చేశారు. గెలుపు ఓటములు సహజమని, మంచి క్రీడా స్ఫూర్తితో నిర్వహించాల్సిందిగా కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ చందన ఉమామహేశ్వరరావు, మాజీ జెడ్పీటీసీ చన్నంశెట్టి కోదండ రామయ్య, ఉపసర్పంచ్ చన్నంశెట్టి నాగరాజు, పీఏసీఎస్ అధ్యక్షుడు అంకెం నరసయ్య, దాసి ఏసుబాబు, చన్నంశెట్టి శ్రీకాంత్, టోర్నమెంట్ నిర్వహణ కమిటీ, క్రీడాకారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్

వైభవంగా సోమేశ్వరునికి లక్ష బిల్వార్చన

పామర్రు: సోమేశ్వరస్వామి లక్ష బిల్వార్చన కార్యక్రమం భక్తులను అలరించింది. స్థానిక గంగా పార్వతీసమేత సోమేశ్వరస్వామి ఆలయంలో పామర్రు బ్రాహ్మణ సేవా సమితి సభ్యుల ఆధ్వర్యంలో లక్ష మారేడు దళాలతో బిల్వార్చన కార్యక్రమం ఆదివారం వైభవంగా జరిగింది. తొలుత స్వామికి నమక చమకాలతో ఏకాదశి రుద్రాభిషేకాలను పంచామృతాలు, నవరసాలు, సుగంధ ద్రవ్యాలతో స్వామికి విశేషంగా అన్నాభిషేకాలను నిర్వహించారు. పామర్రు బ్రాహ్మణ సేవాసమితి అధ్యక్షుడు భేతనబొట్ల సుబ్బారావు, ఆర్గనైజర్ బేతనబొట్ల ఫణి కిషోర్‌శర్మల ఆధ్వర్యంలో ఈకార్యక్రమాలను నిర్వహించారు. స్థానిక పార్వతీ అమ్మవారి ఆలయంలో కుంకుమ అర్చన కార్యక్రమం జరిగింది. తదుపరి నీరాజన మంత్ర పుష్పాలను ఇచ్చి భక్తులకు స్వామి తీర్థ ప్రసాదాలను అందించారు. అనంతరం స్థానిక చావలి వెంకటేశ్వరరావు గృహం వద్ద కార్తిక సమారాధన ధాత్రి పూజలను నిర్వహించారు. వచ్చిన భక్తులకు అన్న ప్రసాదాన్ని అందజేశారు. సమితి సభ్యులు గడియారం బాలగంగాధర శర్మ, బేతనబొట్ల చంద్రశేఖర్‌రావు, ఘడియారం సుబ్రమణ్య శాస్త్రి, లంకా భీష్మకుమార్, లంక చైతన్య ప్రభు, ఆర్.కాశీ విశాలక్ష్మీ, పి.గిరిజ, ఎల్.పద్మలత, బి.కనకదుర్గ, జీ కామేశ్వరి పాల్గొన్నారు.



పామర్రులో సోమేశ్వరస్వామికి లక్ష బిల్వార్చన నిర్వహిస్తున్న అర్చకులు

చిన్నారులను ఉత్తములుగా తీర్చిదిద్దాలి

పామర్రు: చిన్నారులకు చదువుతో పాటుగా సంస్కారం, ఆచారాలు, సంప్రదాయాలను కూడా నేరిృంచాలని ఉమ్మడి కృష్ణా జిల్లా సమరసత సేవా ఫౌండేషన్ ధర్మ ప్రచారక్ ఆళ్ల జయశంకర్ అన్నారు. స్థానిక హితమ్ పబ్లిక్ స్కూల్‌లో సమరసత సేవ ఫౌండేషన్ బాల వికాస్ పాఠశాలల ఉపాధ్యాయులు, చిన్నారుల సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేవ ఫౌండేషన్ ద్వారా బాల వికాస్ పాఠశాలలను నిర్వహించి విద్యార్థుల అభ్యున్నతికి కృషి చేస్తున్నామని అన్నారు. చదువుతో పాటుగా సమాజంలో పెద్దలతో ఏవిధంగా మెలగాలి, క్రమశిక్షణతో ఉండే విధంగా పాఠాలను నేర్పించడం జరుగుతోందన్నారు. ఉత్తమమైన నడవడికలతో కూడిన వ్యక్తిగా చిన్నారులను తయారు చేయడంలో తల్లుల పాత్ర కీలకమైనదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హితమ్ స్కూల్ ప్రిన్సిపాల్ నంది పాటి హేమంత్‌రెడ్డి, ఫౌండేషన్ మండల ప్రముఖ్‌లు పానుగుమాటి లక్ష్మణ్, బొమ్మారెడ్డి కోటిరెడ్డి, దేగల రవీంద్రబాబు, ఆళ్ల రామిరెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సమరసత సేవా ఫౌండేషన్ ధర్మ ప్రచారక్ జయశంకర్

రైతుకు న్యాయం.. ఇదే లక్ష్యం

క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్న అధికారులు

చిలకలపూడి(మచిలీపట్నం): రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు మిచాంగ్ తుపాను కారణంగా నష్టపోయిన రైతులను ఆదుకునే దిశగా జిల్లా యంత్రాంగం అడుగులు వేస్తోంది. తుపాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు జిల్లా వ్యాప్తంగా రైతులు పండించిన పంట నీట మునగటంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. దీంతో వ్యవసాయశాఖ అధికారులు వాస్తవ పరిస్థితులను తెలుసుకునేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే ప్రాథమిక అంచనాలు రూపొందించగా.. ఈ అంచనాల్లో 1,03,778 హెక్టార్లలో నష్టం జరిగినట్లు వ్యవసాయశాఖ అధికారులు గుర్తించారు. వ్యవసాయశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు కలెక్టర్ రాజాబాబు ఉత్తర్వులతో క్షేత్రస్థాయిలో ప్రతి రైతు నష్టాన్ని అంచనా వేసేందుకు వ్యవసాయశాఖ అధికారులు సిద్ధమయ్యారు.

34 అంశాలతో..

వ్యవసాయశాఖ విడుదల చేసిన నియమనిబంధనల ప్రకారం 34 అంశాలతో రూపొందించిన ఫార్మాట్ ద్వారా ప్రతి రైతు నుంచి వివరాలు సేకరించనున్నారు. రైతు పేరు, తండ్రి, ఈ–క్రాప్ ఐడీ నంబర్, సర్వే నంబర్, విస్తీర్ణంతో పాటు రైతు బ్యాంక్ ఖాతా నంబర్, ఆధార్ నంబర్‌ను సేకరిస్తారు. 33 శాతం పైబడి నష్టపోయిన రైతుల వివరాలను తెలుసుకుంటారు. ఈ సర్వేలో దిగుబడి ప్రామాణికాన్ని కూడా పరిగణనలోకి తీసుకోనున్నారు.

ప్రభుత్వానికి ప్రతిపాదనలు..

క్షేత్రస్థాయిలో వర్షపునీరు తొలగించిన వెంటనే వ్యవసాయశాఖ అధికారులు ఫార్మాట్ ప్రకారం రైతుల వద్ద నుంచి సేకరించిన వివరాలతో పాటు వారికి రావాల్సిన ఇన్‌పుట్ సబ్సిడీ వివరాలను కలెక్టర్ ద్వారా వ్యవసాయశాఖ కమిషనర్‌కు ప్రతిపాదనలు పంపనున్నారు.



పామర్రులో పంట నష్టపోయిన రైతుల నుంచి వివరాలు సేకరిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

సాగర తీరంలో పర్యాటకుల సందడి

కోడూరు: మండల పరిధిలోని హంసలదీవి సాగరతీరం పర్యాటకులతో కళకళలాడింది. శని, ఆదివారాలు వరుస సెలవులతో పాటు కార్తిక మాసం కూడా కావడంతో వివిధ ప్రాంతాలకు చెందిన యాత్రికులు ప్రత్యేక వాహనాల్లో తీరానికి పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. సాగరంలో సందడి చేశారు. పాలకాయతిప్ప బీచ్ వద్ద పర్యాటకులు పుణ్యస్నానాలు ఆచరించారు. మహిళలు తీరంలోనే సైకత శివలింగాలు సిద్ధం చేసి కార్తిక దీపాలు వెలిగించారు. యువకులు బీచ్ కబడ్డీ, వాలీబాల్ ఆటలతో సందడి చేశారు. సాగర సంగమం వద్ద పరిస్థితులు అనుకూలించకపోవడంతో అక్కడకు పర్యాటకుల రాకపోకలను నిషేధించారు. పాలకాయతిప్ప మెరైన్ పోలీసులు తీరం వెంట ముమ్మర గస్తీ నిర్వహించారు.



● వ్యక్తికి గాయాలు

పెదన: పెదన–బంటుమిల్లి రోడ్డులో ఆదివారం ఉదయం ఓ వ్యక్తి బండిపై నుంచి కిందపడిపోయి ఉండగా స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పెదన ఎస్‌ఐ రవిచంద్రకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. సదరు వ్యక్తి మద్యం తాగి వాహనం నడపడంతో అదుపు తప్పి కిందపడి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. బాధితుడిని 108 వాహనంలో మచిలీపట్నం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వివరాలు తెలియాల్సి ఉందన్నారు.